క్లుప్తంగా



నెల్లూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పర్యటనకు వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో కరచాలనం చేసి స్వాగతం పలుకుతున్న కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ -కావలి

బాధితుడికి చేయూత



ఆత్మకూరు: పట్టణంలోని 13వ వార్డు పరిధిలోని తిప్పపై నివాసం ఉంటున్న ఒంగోలు యేసోబు తీవ్రఅనారోగ్యంతో మంచానికే పరిమితమవడంతో కుటుంబం పూట గడపడం కష్టమైంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జే ప్రణీత్ యేసోబు ఇంటికి వెళ్లి శనివారం పరామర్శించారు. తమ ఆస్పత్రి ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు నగదు సాయం అందజేశారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యులు సందీప్ కుమార్, డాక్టర్ కుమార్, టీ అశోక్, రహీం, నరేష్, చోటు, తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేయాలని వినతి



వింజమూరు(ఉదయగిరి): జిల్లాలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఉదయగిరి ప్రాంత విద్యార్థుల ప్రయోజనార్థం ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఇన్ ఇన్నోవేటివ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లెక్కమనేని రాజేష్ కోరారు. ఈ మేరకు నెల్లూరులో ఎన్‌సీసీ జిల్లా అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి దేశ సరిహద్దులో సేవలు అందిస్తున్న సైనికులు అధికంగా ఉన్నారని తెలిపారు. చిన్నతనం నుంచి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ



సంగం: స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై సీఐ వేమారెడ్డి శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల పత్రాలను పరిశీలించి వాహదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.


ఎస్‌ఎంసీ ఎన్నికలు



తూర్పుబోయమడుగుల పాఠశాలలో ఎస్‌ఎంసీ కమిటీ ప్రమాణ స్వీకారం

వరికుంటపాడు: మండలంలో వాయిదా పడిన జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, తూర్పు బోయమడుగుల, మహమ్మదాపురం పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను శనివారం నిర్వహించారు. జంగంరెడ్డిపల్లి పాఠశాలలో తగిన కోరం లేక మరోసారి ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈఓలు షావుద్దీన్, రమణయ్య తెలిపారు. తూర్పుబోయమడుగుల, మహమ్మదాపురం పాఠశాలలకు సంబంధించి చైర్మన్లుగా మలికి భాగ్యలక్ష్మి, ఎల్ కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

అమరపునాయుడుకండ్రికలో మాజీ ఎంపీ లగడపాటి



సంగం: మండలంలోని అమరపునాయుడుకండ్రికలో ఉన్న ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం సందర్శించారు. తన కుమారుడు, తల్లి రామలక్ష్మమ్మతో కలిసి వృద్ధాశ్రమాన్ని పరిశీలించి కాసేపు సరదాగా గడిపారు. స్థానికులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకు బయలుదేరి వెళ్లారు.

బొప్పాయి సాగు.. లాభాలు బాగు

సంప్రదాయ పంటలు సాగు చేసి దిగుబడులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుంటూ పండ్ల తోటల సాగు చేపడుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని మెట్టప్రాంత రైతులు ప్రధానంగా బొప్పాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్లో బొప్పాయి కాయలకు మంచి గిరాకీ ఉండడం..తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు వస్తుండడంతో విస్తారంగా సాగు చేపడుతున్నారు.



మల్చింగ్ విధానంలో సాగుచేసిన బొప్పాయి తోట

మర్రిపాడు: ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 175 ఎకరాలు, చేజర్లలో 20 ఎకరాలు, ఆత్మకూరులో 60 ఎకరాలు, అనంతసాగరంలో 180 ఎకరాలు, ఏఎస్‌పేటలో 10 ఎకరాల్లో బొప్పాయి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. మల్చింగ్, డ్రిప్ విధానంలో తక్కువ నీటి ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ విధానంలో పెట్టుబడులు సైతం తక్కువగా ఉండడంతో లాభాలను పొందుతున్నారు. సాధారణంగా బొప్పాయిని జూలై, ఆగస్టు నెలల్లో సాగు చేపడుతారు. ఆరు నెలల నుంచి బొప్పాయి కాయల దిగుబడి ప్రారంభవుతుంది. బొప్పాయి మొక్కలకు ఎకరాకు సుమారు 1000 మొక్కలు వేస్తారు. ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. సుమారు 20 నుంచి 30 టన్నుల వరకు దిగబడులు వస్తాయి. గతేడాది కేజీ బొప్పాయి రూ.9 నుంచి రూ.16 వరకు ధర పలికింది. ఇదే పరిస్థితులు ఈ ఏడాది కొనసాగితే ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు కీలకం

బొప్పాయి సాగులో సస్యరక్షణ చర్యలు కీలకం. బొప్పాయి సాగుచేసే ముందుగా భూమిని 30 నుంచి 40 సెంటీమీటర్ల లోతు వరకు దున్నాలి. మొక్కల మధ్యన 1.8 మీటర్ల దూరం ఉండేలా నాటాలి. మొక్క నాటే పదిహేను రోజుల ముందు



చెట్టుకు నిండుగా ఉన్న బొప్పాయి కాయలు

5 కిలోల పశువుల ఎరువు, కిలో వేప పిండి, 20 గ్రాముల అజోస్పిరిల్లం వేసి బాగా కలిపి గుంతలో నింపుకోవాలి. తేలికపాటి నేలల్లో జింక్, బోరాన్ ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము బోరాక్స్, రెండు గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్క చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిలిస్తే పంటకు నష్టం జరుగుతుంది. నవంబరులో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి రాలిపోతాయి. దాని నివారణకు లీటరు నీటిలో మాంకోజెబ్ 2.5 గ్రాములు పదిహేను రోజుల వ్యవధిలో రెండుసార్లు పంటలపై పిచికారీ చేయాలి. రింగ్‌స్పాట్, మొజాయిక్ వంటి సమస్యలు దోమల వల్ల వస్తాయి, కాన్ఫిడార్ మందును పిచికారీ చేస్తే దోమల వృద్ధి తగ్గుతుంది. బొప్పాయి తోటల్లో అంతర్‌పంటగా బంతి సాగు చేస్తే కొంత వరకు చెట్లకు చీడపీడలను నివారించుకోవచ్చునని మర్రిపాడు ఉద్యాన అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

15 ఎకరాల్లో సాగు చేస్తున్నా



ఏటా బొప్పాయి సాగు చేపడుతున్నా. ఈ ఏడాది 15 ఎకరాల్లో పంట సాగు చేశా. ప్రతి సీజన్‌లోనూ కాయలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. గతేడాది పెట్టుబడులు పోగా ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వచ్చింది. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉద్యానశాఖ అధికారులు చీడపీడల నివారణకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. ప్రస్తుతం మేము అన్ని విషయాలు జాగ్రత్తగా తెలుసుకుని సాగు చేసుకుంటున్నాం.

– రాపూరు నాగరాజారెడ్డి, పొంగూరు

చెరువులోని మట్టిని వదలని తమ్ముళ్లు



విలేకరుల రాకతో పరారవుతున్న వాహనాలు



మట్టి తరలింపునకు వచ్చిన ట్రాక్టర్లు

సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లి చెరువులోని మట్టిని తమ్ముళ్లు కొల్లగొడుతున్నారు. గత మూడ్రోజులుగా జేసీబీని ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. శనివారం ఒక జేసీబీ, 8 ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు విలేకరులకు సమాచారం అందించారు. విలేకరులు ఘటనా స్థలానికి చేరుకోవడం గమనించిన అక్రమార్కులు వాహనాలను తీసుకుని పరారయ్యారు. పదిహేను రోజుల క్రితం కొందరు పంట పొలాలకు చెరువు నుంచి మట్టిని తరలిస్తుండగా ఘర్షణ నెలకొంది. ఆ సమయంలో ఇకపై ఎవరూ చెరువు మట్టిని తరలించకూడదని గ్రామంలో దండోరా వేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయినా మళ్లీ టీడీపీ నాయకులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని చెప్పారు. కొందరు ప్రశ్నించినా తాము అనుమతితోనే తోలుతున్నామని, తమకు ఎవరూ అడ్డురాకూడదని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ స్పందించి మట్టిని అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



మైలు వెంకటేశ్వర్లు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లికి చెందిన మైలు వెంకటేశ్వర్లు అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న గూడూరు జీవాల సంతకు వెళ్లారని, తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. చుట్టుపక్కల గాలించిన ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 79970 43386, 81798 70414 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

20 నుంచి ఆధార్ క్యాంప్‌లు

చేజర్ల: మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ విజయలలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వైద్యురాలి పాశవిక హత్యపై వైద్యుల నిరసన



కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది



కావలి: ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ప్రైవేట్ వైద్యులు



ఆత్మకూరులో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసిబ్బంది మానవహారం

కావలి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను కావలిలోని వైద్యులు ఖండించారు. దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యాచార దుర్ఘటనపై కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఒక బృందంగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్యులు మరో బృందంగా ఏర్పడి శనివారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారికి మద్దతుగా వివిధ సంఘాల వారు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని దురాగతాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో రాత్రి వేళ విధుల్లో ఉండే వైద్య సిబ్బందికి సరైన భద్రత లేదనడానికి వైద్యురాలిపై హత్యాచార ఘటనే నిదర్శనమన్నారు. వైద్యురాలి ప్రతి అవయవం గాయమై రక్తంతో తెల్లకోటు ఎర్రకోటుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి కంటికి కనిపించకుండా, ఎవరి చెవికి వినిపించకుండా పకడ్బందీగా దుర్ఘటన ఎలా జరిగి ఉంటుందని ప్రశ్నించారు. దీని వెనుక పక్కాప్లాన్ ఉండి ఉంటుందన్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు, ప్రిన్సిపల్‌కు ఏ మాత్రం తెలియకుండా ఘటన జరిగి ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఒక్క నిందితుడ్ని మాత్రమే అరెస్ట్ చేశారని, తొమ్మిది రోజులు గడిచినా పోలీసులు అతని నుంచి నిజాలు ఎందుకు రాబట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


అల్లూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆస్పత్రి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యసిబ్బంది నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉదయగిరి: ఉదయగిరిలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది నిరసన ప్రదర్శన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది శివరామ్, భోగ్యం వెంకటేశ్వర్లు, నవాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే వింజమూరులో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న హత్యాచార ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. వైద్యులు మాసిలామణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను ఖండిస్తూ స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఎదుట వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, వైద్యులు కిరణ్, బాలాజీ, స్టాఫ్‌నర్సులు మస్తాన్, ధనకుమారి, ల్యాబ్‌అసిస్టెంట్ సుధాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డాక్టర్ షేక్ మెహతాబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన చేపట్టారు. డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బంది ప్రభావతి, విజయ, నాగజ్యోతి, సుజాత, హెబ్సీబా, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంగం: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీలు, మెడికల్ దుకాణాల నిర్వాహకులు సంగంలోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. అనంతరం సంగంలోని ఆస్పత్రులు, ల్యాబ్‌లు, మెడికల్ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. పీహెచ్‌సీ ఆత్మకూరు డివిజన్ కార్యదర్శి జీ జగన్‌మోహన్ రావు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకటరమణయ్య, పీ మహేష్, పీ తిరుపతిరెడ్డి, కే పెంచలలక్ష్మి, టీ బాలకృష్ణ, రెహమాన్ మెడికల్ షాపుల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



చేజర్లలో..



వింజమూరులో..



అల్లూరులో...



సంగంలో..

వాతావరణ మార్పులు పంటలపై ప్రభావం



మాట్లాడుతున్న ఏడీఏ మారుతిదేవి

సంగం: వాతావరణంలో వస్తున్న మార్పులు పంటలపై ప్రభావం చూపుతాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతిదేవి అన్నారు. మండలంలోని సంగం, తరుణవాయి, వంగల్లు గ్రామాల్లోని రైతులకు సాగు వైవిధ్యంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల పంటలకు తెగుళ్లు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. విచక్షణ రహితంగా రసాయన మందులు వాడడం వల్ల వాతావరణంలో మార్పులు ఏర్పడుతాయన్నారు. అంతర పంటల సాగు, సేంద్రియ ఎరువుల వాడకం, సమగ్ర సస్యరక్షణ చర్యలను రైతులు పాటించాలన్నారు. సుస్థిర ఆదాయం పొందే వరకు మిశ్రమ వ్యవసాయం, ఉద్యాన పంటల సాగు, పశుగ్రాసాలు, పెరటి కూరగాయల సాగు, కోళ్ల పెంపకం చేట్టాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ, వ్యవసాయాధికారి శ్రీహరి, వీఏఏలు శిరీష, ప్రనుషా, కళ్యాణి, గీత, విజయ, రైతులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరరెడ్డి సహకారం మరువలేనిది



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

దుత్తలూరు: దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ సంస్థ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయిని నాగలక్ష్మి కొనియాడారు. దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల కోసం తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి, సబితారెడ్డి దంపతులు శనివారం ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని గ్రంథాలయానికి అందజేసిన ఫర్నిచర్, పుస్తకాలు, సీడ్స్ సంస్థ ద్వారా అప్‌గ్రేడ్ చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. చంద్రమౌళీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను పాఠశాల పూర్వ విద్యార్థినని, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. చంద్రమౌళీశ్వర్‌రెడ్డి దంపతులను ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈఓ వెంగయ్య, విశ్రాంత ప్రొఫెసర్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంక్రీట్ జంగిల్‌గా కావలి



పట్టణంలో భవనాల మధ్య అరకొరగా ఉన్న చెట్లు

కావలి : పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. విపరీతంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాంక్రీట్ భవనాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. పట్టణ పరిధిలో కనీసం మట్టి నేలకు చోటు లేకుండా కాంక్రీట్ భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో పట్టణం కాంక్రీట్ జంగిల్‌గా మారి పచ్చని చెట్లు కరువయ్యాయి. పట్టణంలో సుమారు 4 లక్షల మందికిపైగా జనాభా ఉన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా స్వచ్ఛమైన గాలిని అందించే చెట్లు ఎక్కడా కనిపించవు. వర్షపు నీరు సైతం చుక్కనీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. మానవ మనుగడకు అత్యంత ప్రధానమైన ఈ అంశాలపై మున్సిపాలిటీ దృష్టి సారించి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించి భూమిలోకి వర్షపు నీరు ఇంకేలా, మొక్కల పెంచేలా శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. అల్లూరు మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ శశిరేఖ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆరా తీశారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ జ్యోతి, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్‌ఎంపీపీ గుమ్మడి సురేంద్ర, కొండూరు వాసు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.